


అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరిలో కోటయ్యాపుల్లయ్యా, అని ఇద్దరు రైతులున్నారు. వాళ్ళిద్దరిదీ ఇరుగూ పొరుగూనూ. పైగా వాళ్ళ పొలాలు కూడా పక్క పక్కనే ఉన్నాయి. ఇవన్నీ కాక వాళ్ళు మంచి స్నేహితులుకూడా.

కోటయ్య కొన్ని కోళ్ళను పెంచుతున్నాడు. పుల్లయ్య గొర్రెలను పెంచుతున్నాడు. కోటయ్య కోళ్ళను అప్పుడప్పుడు జంగు పిల్లులు ఎత్తుకు పోతూ ఉండేవి. పుల్లయ్య గొర్రెలూ అప్పుడప్పుడు తప్పి పోతూ ఉండేవి. ఇద్దరూ కలసి, దీనికొక ఉపాయం ఆలోచించారు. ఒక మాంచి కుక్కను పెంచితే ఈ సమస్య తీరిపోతుందనుకొన్నారు.

ఈ కుక్కను చూసి పిల్లులు ఎటుగూడీ భయపడతాయి. అదీ గాక తప్పి పోయిన గొర్రెలను వెదకడానికి కూడా ఈ కుక్క సాయ పడుతుంది. వారం రోజులకల్లా వారో జాతి కుక్కను తెచ్చి పెంచడం సాగించారు. మరో నెల రోజులకల్లా ఆ కుక్క అటు కోళ్ళతోనూ,

ఇటు గొర్రెలతోనూ స్నేహం చేయసాగింది. కోటయ్య కోళ్ళల్లో ఓ నల్ల పుంజు ఉన్నది. దానికీ కుక్కకూ మంచి దోస్తి.

ఒకసారి ఆ రెండింటికీ పట్నం చూడాలనిపించింది. కోటయ్య. పుల్లయ్య పొలం వెళ్ళగానే, అవి రెండూ పట్నం బయలుదేరాయి. కానీ కొత్త గనకా, తోవ తెలియదు గనకా, అవి పొద్దుకూకే వేళకు ఒక అడవికి చేరుకున్నాయి. ఆ రాత్రి అడవిలో గడిపి, మరునాడు పొద్దుటే పట్నం పోదా మనుకున్నాయి.

కోడిపుంజు చెట్టుకొమ్మ మీదకి - చేరుకొన్నది. కుక్క - అదే చెట్టులో ఓ తొర్రి ఉంటే అందులో చోటు చేసుకొన్నది. కాస్సేపు ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకొని అవి నిద్ర పోయాయి.

కోడికి పొద్దుటే లేవడం అలవాటు గదా! అట్లాగే లేచి "కొక్కొరో కో" అంటూ కూసింది. ఆ కూతను దూరంగా ఉన్న ఓ నక్క విని, ఆ చెట్టు దగ్గర కొచ్చింది.

కోడి కేకను కాసేపు పొగిడింది. కోడిని కిందికి దిగి రమ్మన్నది. ఇద్దరం కలసి నాట్యం చేద్దామన్నది. కిందికొస్తే జరిగే దేమిటో కోడికి తెలుసు. అందుచేత అది నక్కనే పైకి రమ్మన్నది.

నక్క చెట్టు తొర్రిల గుండా, చెట్టు మీదికి రావడానికి చూసింది. నక్కను చూచిన కుక్క దాని మీదకి దూకి గీకి పెట్టింది. ఆ నక్క కాస్తా తోక ముడుచుకొని పరుగో పరుగు

కోడి, కుక్క తమలో తాము నవ్వుకొని-తిరిగి పట్నానికి బయలు దేరాయి. దుర్మార్గుల మాటలు తీయగా ఉంటాయి. వాటిని నమ్మి మనం మోసపోకూడదు.

—o—